30వ ఎపిసోడ్

Protecting Mountain Ecosystem And Promoting Ecotourism

నాటకం పేరు : -మన పర్యాటక ప్రాంతాన్ని కాపాడుకుందాం

పాత్రల పేర్లు :

1. భాస్కర్ : టూరిజం పై అభిమానం గల గ్రామస్థుడు. తండ్రి 40 సం
2. సరిత : తల్లి 35సం
3. వరుణ్ : జీవవైవిధ్యం పట్ల అభిమానం గల విద్యార్థి. భాస్కర్ కొడుకు 10
4. జ్యోత్స్న : ప్రకృతి అంటే ఇష్టం గల విద్యార్ధి భాస్కర్ కూతురు 13సం
5. రమణ : సెక్రటేరియట్ లో పని చేస్తున్న వ్యక్తి సరిత తమ్ముడు 32సం
6. రంగాచారి : పూజారి 60సం
7. కృష్ణ : బిల్డర్ దగ్గర పనిచేస్తున్న వ్యక్తి 45సం
8. సర్పంచ్ : 50సం వ్యక్తి

వరుణ్ — అమ్మా ఏమైంది అన్ని సర్దేశావా ! నాది ఇంకొక డ్రెస్ పెట్టు నేను అక్కడి జలపాతంలో స్నానం చేస్తా

సరిత — అబ్బబ్బా అన్ని పెట్టానురా ఉదయం నుండి ఒకటే హడావుడి పడుతున్నావు. హడావుడి పెడుతున్నావు.

జ్యోత్స్న — అవును అమ్మా ! మనం వెళ్ళేది పిక్నిక్ కదా అందుకే అంత హడావుడి చేస్తున్నాడు. అదే స్కూలు కయితే రోజు నువ్వు తొందర పెట్టాలి.

వరుణ్ — వ్వె...వ్వె....వె

రమణ — ఇంతకీ మనం ఎక్కడికి వెళ్ళుతున్నాం ?

వరుణ్ — మామయ్యా మన ఊరు చివర ఉన్న పాండవుల గుట్టకు వెళుతున్నాం. అక్కడ ఎంత బాగా ఉంటుందో తెలుసా. చిన్న గుడి, సన్నటి జలపాతం, బోలెడన్ని చెట్లు, రకరకాల పక్షులు, కుందేళ్ళు సూపర్ గా ఉంటుంది మామయ్యా.

జ్యోత్స్న — అవును మామయ్యా అక్కడికి వెళ్ళితే అస్సలు రావాలనిపించదు.

భాస్కర్ — అవును రమణ ప్రకృతి ప్రసాదించిన గొప్ప వరం అనుకో మా ఊరికే గర్వకారణం.

సరిత — అన్ని సర్దడం అయ్యాయి. వరుణ్, జ్యోత్స్న లగేజ్ కారులో పెట్టండి.

వరుణ్, జ్యోత్స్న — ఓ ఇప్పుడే పెట్టి వస్తాం.

రమణ — అవును బావ మా ఫ్రెండ్స్ కూడా చాలా సార్లు చెప్పారు. చాలా ప్రశాంతమైన

ప్రదేశమని, సిటి నుండి చాలా మంది వస్తుంటారట కదా.

సరిత అవునురా తమ్ముడు సెలవు రోజులలో బాగా వస్తుంటారు. యాంత్రికమైన జీవితానికి ఈ ప్రదేశం కొంత ప్రశాంతత నిస్తుంది.

వరుణ్ అమ్మా లగేజ్ అంతా పెట్టి వచ్చాము. రండి త్వరగా

భాస్కర్ సరే. పదండి.

------------( మ్యూజిక్ కారు హారన్ శబ్దాలు )---------------

రమణ ఆ గుడిని ఎవరు నిర్మించారు బావ

భాస్కర్ పాండవుల గుహ అని చెబుతారు. మహాభారతం లోనిది అనుకుంటా.

రమణ నిజంగా రాజులు చక్కటి శిల్పాలతో నిర్మాణాలు చేసారు కదా, మన రామప్ప, వేయి స్థంబాల గుడిలో శిల్పాలు ఎంత బాగుంటాయి.

భాస్కర్ నిర్మాణాలు ఒక ఎత్తైయితే చక్కటి ప్రశాంత వాతావరణం కలిగి, ప్రకృతి రమణీయతను కలిగిన ప్రదేశాలను గుర్తించడం మరొక గొప్పతనం.

రమణ అవునవును వాటివల్లే మనకు ప్రకృతి ఒడిలో కాస్త సేదదీరే అవకాశము కలుగుతుంది.

వరుణ్ వచ్చేశాం మామయ్యా.

సరిత పదండి పిల్లలు తలా ఒక బ్యాగ్ పట్టుకొనిరండి.

( నీళ్ళు పడుతున్న శబ్దాలు, పక్షుల శబ్దాలు )

రమణ అవును బావగారు మీరు చెప్పినట్లు చాలా బాగుంది ఈ ప్రదేశం ఎంత గ్రీనరీగా ఉంది.

జ్యోత్స్న కాగితాలు ఎక్కడ పడితే అక్కడ వేసారు. వరుణ్ వాటిని తీసి డస్ట్ బిన్ లో పడవెయ్యి.

రమణ చక్కగా డస్ట్ బిన్ లు పెట్టారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి అని సైన్ బోర్డ్ లు కూడా పెట్టారు. అయిన కొంత మందికి ఎక్కడ పడితే అక్కడ పడెయ్యడం అలవాటు.

భాస్కర్ మా ఊరివాళ్ళమే ఒక కమిటిగా ఏర్పడి ఈ డస్ట్బిన్ లను ఏర్పాటుచేశాం. అక్కడక్కడ సైన్ బోర్డులు పెట్టాం. గ్రామ పంచాయితీ నుండి పనివారు కూడా వచ్చి శుభ్రం చేస్తుంటారు.

రమణ అంటే మీరీ ప్రదేశానికి చాలా ప్రాముఖ్యత ఇస్తున్నారన్న మాట.

భాస్కర్ అవును మా ఊరిలో ఉన్న మంచి పర్యాటక ప్రాంతం గా మేము గర్వపడుతుంటాం.

వరుణ్ అవును మామయ్యా మేము కూడా హరితహారం ప్రోగ్రాం లో మా స్కూలు నుండి వచ్చి మొక్కలు నాటాం.

| | |
|---|---|
| రమణ | అంటే మీ ఊరివాళ్ళందరికి చాలా ఇష్టమైన ప్రదేశం అన్నమాట. |
| సరిత | అవును తమ్ముడు. మా వరుణ్ కయితే మరీ ఇష్టం. |
| వరుణ్ | అమ్మా పదపదా జలపాతం దగ్గరికి వెళ్లుదాం. |
| జ్యోత్స్న | పద బట్టలు తీసుకుని వస్తున్నా. |
| సరిత | జాగ్రత్త మరీ లోతులోకి వెళ్ళకు. |
| | ----------------మ్యూజిక్-------------- |
| సరిత | వరుణ్,జ్యోత్స్న  ఎక్కడ ఉన్నారు రండి గుళ్ళో కి వెళ్ళుదాం |
| జ్యోత్స్న | వస్తున్నాం అమ్మా, ఈ కుందేలు చూడు ఎంత అందంగా ఉంది. |
| వరుణ్ | అవును నువ్వు తెచ్చిన క్యారెట్ తొందరగా పెట్టు అక్కడ అమ్మ పిలుస్తుంది. |
| జ్యోత్స్న | ఇదిగో పెట్టేస్తున్న. ఇగ పద. |
| సరిత | ఎక్కడి కెళ్ళారు ఇద్దరు. |
| వరుణ్ | కుందేళ్ళకు క్యారెట్లు తినిపించి వస్తున్నా మమ్మ |
| రమణ | అవునా చాలా మంచి పని చేసారు. |
| భాస్కర్ | పదండి గుళ్ళోకి వెళ్లుదాం.నమస్కారం పూజారి గారు. |
| రంగాచారి | నమస్కారం భాస్కర్ బాబు. ఈ మధ్య కనబడడం లేదు. |
| భాస్కర్ | అవును ఈ మధ్య ఆఫీసు పని ఒత్తిడి ఉండడం వలన రాలేకపోయాను. |
| రంగాచారి | నేనే మీ దగ్గరికి వద్దామనుకుంటున్నాను. |
| భాస్కర్ | ఎందుకు పూజారి గారు. |
| రంగాచారి | ( బాధగా ) అయిపోయింది బాబు. అంతా అయిపోయింది ఈ ప్రకృతి దృశ్యం నాసనమయ్యే పరిస్థితి వచ్చింది. ఇంత అందమైన ప్రదేశం కాంక్రీట్ జంగల్ గా మారే పరిస్థితి వచ్చింది. |
| సరిత | ( ఆతురుత గా ) ఎందుకండీ ఎందుకు అలా అంటున్నారు. ఏం జరిగింది. |
| రంగాచారి | చూస్తున్నారా అక్కడ అంతమంది ఉన్నారు. |
| భాస్కర్ | అవును నేను కూడా అనుకుంటున్నాను. ఈ రోజేంటి చాలా మంది వచ్చారు అని. అందులో వాళ్ళందరూ చాలా కొత్తగా కనిపిస్తున్నారు. |
| రంగాచారి | అవును భాస్కర్ బాబు వాళ్లంతా కొత్తవారే. ఇక్కడ ఒక ఫైవ్ స్టార్ హోటల్ కడతారంట. అదిగో ఆ బ్లూ షర్ట్ అతను ఇటే వస్తున్నాడు చూడు కృష్ణ ,మన ఊరి వాడే ఎదో కంపెనీ లో జాబ్ వస్తే పట్నం వెళ్ళాడు. అతనే అన్నాడు స్టార్ హోటల్ కడుతున్నామని. |
| కృష్ణ | నమస్కారం పూజారి గారు. |
| రంగాచారి | ఈ రోజేంటి చాలా మందిని తీసుకొచ్చారు. |

| | |
|---|---|
| కృష్ణ | మీకు చెప్పానుగా పూజారిగారు. ఇక్కడొక ఫైవ్ స్టార్ హోటల్ కడతామని. ఇంజనీర్లు వచ్చారు లొకేషన్ చూద్దా మని, దానిని బట్టి వాళ్ళు ప్లాను గీసిస్తారు. |
| భాస్కర్ | అయినా ఇక్కడ ఫైవ్ స్టార్, హోటల్ కట్టే దెవరు ? |
| కృష్ణ | దీక్షిత్ గారని మల్టి మిలయనీరు. ఆయనకు ఎన్నో ఫైవ్ స్టార్ హోటళ్ళు ఉన్నాయి. అనేక పర్యాటక ప్రాంతాలలో రిసార్ట్స్ ఉన్నాయి. |
| వరుణ్ | ఓహో అందమైన ప్రదేశాలన్నింటిని ఇలాగే ఫైవ్ స్టార్ హోటల్ కట్టి నాశనం చేస్తుంటాడా మీ దీక్షితులు. |
| సరిత | వరుణ్ తప్పు అలా అనకూడదు. |
| వరుణ్ | అది కాదమ్మా ఇంత అందమైన ప్రదేశాన్ని నాశనం చేసి హోటల్ కడతానంటారేమిటి. వింటూ ఉంటేనే ఏడుపు వచ్చేస్తుంది. |
| కృష్ణ | అది కాదు బాబు హోటల్ కడితే నష్టం ఏమిటి ?  మా యజమానికే కాదు, మీ ఊరి వాళ్లకు కూడా ఆదాయం వస్తుంది. హోటల్ లో పని చేయడానికి వీలవుతుంది. వచ్చే వాళ్ళ కోసం చిన్న చిన్న దుకాణాలు పెట్టుకోవచ్చు వెహికిల్ రిపేర్ షాప్ పెట్టుకోవచ్చు. మీ గ్రామం చిన్న పాటి సిటీ లాగ మారిపోతుంది. |
| భాస్కర్ | మాకు ఆ పట్నం వాసనలే వద్దు, ఆ ఆదాయము వద్దు మా గ్రామస్థు లెవరు దీనికి ఒప్పుకోరు. |
| కృష్ణ | ఆదాయం వస్తుందంటే ఎందుకు ఒప్పుకోరు. |
| భాస్కర్ | అయినా మా గ్రామ శివారులో హోటల్ కడుతు మా గ్రామస్థుల పర్మిషన్ తీసుకోరా. |
| కృష్ణ | చెప్పానుగా మా యజమాని మల్టి మిలియనీరు అని. ఆయనకు ఏంతో మంది రాజకీయ నాయకులతో పరిచయ ముంది మీ దగ్గర పర్మిషన్ తీసుకోవలసిన అవసరం ఆయనకు లేదు. తాను ఎలాగైనా పర్మిషన్ తెచ్చుకుంటారు. దాదాపు ఆ పని కూడా అయిపోవచ్చు. అందుకే మమ్మల్ని పంపించాడు. ఇక్కడికి ఏరియా స్కెచ్ గీసుకు రమ్మని. త్వరలో పనులు కూడా మొదట పెడతాం. |
| రమణ | అయినా మీకు పర్మిషన్ ఎలా వస్తుంది. ఆ జలపాతం నుండి వచ్చే నీరు గ్రామస్తులు వ్యవసాయానికి ఉపయోగిస్తున్నారు. అంతేకాదు ఎప్పుడో ఏళ్ళనాటి ప్రాచీన కట్టడం కనుమరగువుతుంది. చెట్లను నరకడం వలన ఇక్కడి జీవ వైవిధ్యం దెబ్బతింటుంది. ఆ బండలను పేల్చడం వలన చుట్టు ప్రక్కల ఇండ్లు బీటలు వారుతాయి ఇన్ని నష్టాలు ఉండగా మీకెలా పర్మిషన్ |

ఇస్తారు ?

| | |
|---|---|
| కృష్ణ | అదంతా నాకు తెలియదు. మీకు చెప్పానుగా మా యజమాని అసాధ్యుడు అని ఇలాంటి ప్రదేశాలెన్ని చోట్లనో ఫైవ్ స్టార్ హోటళ్ళు కట్టాడు. వస్తాను మరి. |
| రంగాచారి | భాస్కర్ బాబు ఈ వవిషయం గూర్చి చాలా సీరియస్ గా ఆలోచించాలి. |
| భాస్కర్ | తప్పకుండ పూజారి గారు. రేపే గ్రామంలో మీటింగ్ పెడదాం. సర్పంచ్ గారు, గ్రామ ప్రజలు అందరం కలిసి పరిష్కారం ఆలోచిద్దాము. వస్తాను మరి. |
| | ----------------మ్యూజిక్ కారు హారన్ ------------------- |
| జ్యోత్స్న | ఇప్పుడేం జరుగుతుంది నాన్న. నిజంగానే ఫైవ్ స్టార్ హోటల్ కట్టేస్తారా ? |
| సరిత | అవునండి, మనం ఈ ప్రకృతి రమణీయతను కోల్పోవలసిందేనా. |
| భాస్కర్ | లేదు లేదు. అలా ఎలా కానిస్తాం. రేపు గ్రామస్థులతో మీటింగ్ పెడుతున్నాం కదా ఏదో ఒకటి సీరియస్ గానే చేద్దాం. |
| రమణ | అవును అక్కయ్య నేను కూడా పొలిటికల్ గా ఆపే ప్రయత్నం చేస్తాను. నువ్వేమి దిగులుపడకు. కాని గ్రామస్థుల నుండి ఈ విషయమై బాగా వ్యతిరేకత రావాలి. |
| వరుణ్ | నాన్న, మామయ్యా మీరు ఎలాగైనా ఆపాలి. మా స్టూడెంట్స్ అందరు కావాలంటే ధర్నాలు చేస్తాం. |
| భాస్కర్ | సరేలేరా నువ్వేం కంగారు పడకు మేం ఉన్నాంగా మేం చూసుకుంటాం. |
| సరిత | ఇల్లోచ్చేసింది దిగండి. ఉత్సాహం అంతా నీరు కారిపోయింది ఆ కృష్ణ మాటలతో, పదండి ఇంట్లోకి. |
| | ------మ్యూజిక్ రాత్రి అయినట్లుగా శబ్దాలు ------------------ |
| వరుణ్ | కలవరిస్తుంటాడు.<br>అయ్యో పచ్చని చెట్లన్నీ పడిపోతున్నాయి. అయ్యో నా కుందేళ్ళన్ని భయపడి పరుగెత్తుతున్నాయి. ఏమిటి ఇంట పెద్ద పెద్ద శబ్దాలు. ఆపెయ్యండి, ఆపెయ్యండి. |
| భాస్కర్ | వరుణ్ అరె వరుణ్ లే. ఏంటి ఏదైన పీడకల కన్నావా లే లేచికూచో కొన్ని మంచినీళ్ళు తాగు. |
| వరుణ్ | అమ్మో కలనా ఇది. మన గుట్ట మీద హోటల్ కడుతున్నట్టు చెట్లను మిషన్ లతో నరుకుతున్నట్టు, కుందేళ్ళు వాటి కింద పడి చనిపోతున్నట్టు కల వచ్చింది నాన్న. |
| రమణ | నువ్వు ఆ గుట్ట గురించే ఆలోచిస్తూ పడుకున్నట్టున్నావు. అందుకే అదే కలగా |

| | |
|---|---|
| | వచ్చింది. వరుణ్ నువ్వు కలగన్నట్టు అక్కడేమి జరగదు. మేమంతా లేమా దీనిని ఖచ్చితంగా ఆపేస్తాము. |
| భాస్కర్ | అవును వరుణ్ మేము చూసుకుంటాం నువ్వు ప్రశాంతంగా పడుకో |
| రమణ | బావా నువ్వు ఊరి వాళ్ళందరిని జాగ్రత పరచు. వీలయితే అందరం వెళ్ళి కేంద్ర, రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రికి రిప్రజంటేషన్ ఇద్దాం. |
| భాస్కర్ | అలాగే రమణ తప్పకుండా. |
| | --------------మ్యూజిక్ --------------- |
| | ( అందరు తమలో తామే మాట్లాడుకుంటూ ఉంటారు. ఇది అన్యాయం, అలా ఎలా కట్టనిస్తాం అంటూ ) |
| భాస్కర్ | ఊ అందరు వచ్చారా ఇప్పుడు రంగాచారి గారు విషయం చెబుతారు నిశ్శబ్దం గా ఉండండి. |
| రంగాచారి | వారం రోజుల క్రితం మన ఊరివాడైన కృష్ణ కొంత మందిని తీసుకొని గుట్ట పైకి వచ్చాడు. టేపులతో ఆ ప్రదేశాన్నంత కొలుస్తున్నాడు. నేను చూసి అడిగాను. ఎందుకు కోలుస్తున్నారని అప్పుడు చెప్పాడు. వాళ్ళ యజమాని ఫైవ్ స్టార్ హోటల్ కడదామని ప్లాన్ చేస్తున్నాడని. మళ్ళీ నిన్న ఇంజనీర్లను తీసుకొచ్చాడు. బాస్కర్ బాబు కూడా చూశాడు వాళ్ళని. |
| భాస్కర్ | అవును నేను కూడా కృష్ణ తో మాట్లాడాను. దాదాపు పర్మిషన్ వచ్చినట్లుగానే మాట్లాడాడు చాలా వేగంగా పనులు మొదలు పెట్టాలని చూస్తున్నారు. గ్రామస్థులారా ముందుగా మీ అభిప్రాయం చెప్పండి. అక్కడ హోటల్ కట్టడం మీకు ఇష్టమేనా. |
| అందరు కోరస్ గా | లేదు, లేదు. గుట్టపై హోటల్ కట్టనీయ కూడదు. ఇన్ని రోజుల నుండి మనం కాపాడుకుంటూ వస్తున్న ప్రకృతిని నాశనం చేయనీయవద్దు. |
| భాస్కర్ | అయితే మనం ఇప్పుడు ఏం చేద్దాం. ఈ విషయం పై మన సర్పంచ్ గారు మాట్లాడుతారు. |
| సర్పంచ్ | నాకు కూడా ఈ విషయం నిన్ననే తెలిసింది. ఇంత వరకు నాతో హోటల్ కట్టేవారెవరు వచ్చి సంప్రదించలేదు. మరి మానను అడగకుండానే కట్టేస్తున్నారా ? |
| రమణ | ఏముంది కట్టే దీక్షితులు గార్కి రాజకీయంగా చాలా పలుకుబడి ఉంది. అందుకే పర్మిషన్ తెచ్చుకున్నట్టు ఉన్నాడు. |
| అందరు | అంటే మన గ్రామ ప్రజల మనోభావాలతో పని లేదా |
| సర్పంచ్ | అదే నేను అడిగాను. దానికి వారేమన్నారంటే మేము మీకు ఏం నష్టం కలిగించము. మీ గ్రామానికి ఆదాయాన్ని కల్పిస్తున్నాం. మా హోటల్ లో |

| | |
|---|---|
| | ఉద్యోగాలు మీ ఊరి వాళ్ళకే ముందుగా ఇస్తాం. స్టార్ హోటల్ కు ఎంతో మంది వస్తుంటారు. మీరు చిన్న చిన్న వ్యాపారాలు పెట్టుకోవచ్చు అంటున్నారు. మరి మీరే మంటారు. |
| భాస్కర్ | ప్రకృతిని నాశనం చేస్తు పొందే ఆదాయం మాకు వద్దే వద్దు. పాండవుల గుట్ట మన ఊరికే తలమానికం. మన చరిత్రకు నిదర్శనం కష్టపడి ఎన్ని మొక్కలు పెంచాం. వాళ్ళిచ్చే ఉద్యోగాల కోసం మన పర్యాటక ప్రాంతాన్ని వదులకోం ఏమంటారు. |
| అందరు | అవును, అవును ఎట్టి పరిస్థితిలోను వదులుకోం. |
| సర్పంచ్ | అయితే మరి ఎలాంటి చర్యలు తీసుకుందాం. దేనికైనా అందరం ఒక తాటి పై ఉండాలి. కలిసి కట్టుగా పోరాడాలి. |
| అందరు | ఓ తప్పకుండ దేనికంటే దానికి సిద్ధం. |
| రమణ | అయితే ఒక పని చేద్దాం. ముందుగా గ్రామం తరపున కోర్టులో కేసు వేద్దాం. గ్రామం యొక్క విశిష్టత, గుట్ట చారిత్రిక నేపధ్యం. గ్రామస్థులుగా మీరెంత కష్టపడి జీవ వైవిద్యాన్ని కాపాడుతున్నారో అన్ని విషయాలు కోర్టుకు తెలియజేద్దాం. కోర్టు కు వెళ్ళితే ముందుగా స్టే ఇస్తుంది. మనకు కొంత టైం దొరుకుతుంది. |
| భాస్కర్ | అవును ఆ తరువాత అందరం వెళ్ళి పర్యావరణ మంత్రిత్వ శాఖలను, MP లను, MLA లను కలుద్దాం. |
| అందరు | ఓ తప్పకుండ అలాగే చేద్దాం. |
| రమణ | మీ ఆదాయం చూస్తె ముచ్చటేస్తుంది.మీ ఐఖమత్యం గొప్పది తప్పకుండ మీరు విజయం సాధిస్తారు. |
| సర్పంచ్ | సరే అందరం మళ్ళీ రేపు కలుద్దాం. |
| | ------------------మ్యూజిక్-------------------------- |
| భాస్కర్ | ఏంట్రా వరుణ్ ఆ బ్యాగ్ నిండా ఏం పట్టుకొస్తున్నావు ? |
| వరుణ్ | ఉత్తరాలు నాన్న. |
| భాస్కర్ | ఉత్తరాలా ? ఉత్తరాలు ఎవరు రాశారు ? ఎవరికి రాశారు ? |
| జ్యోత్స్న | మేమే రాశాము నాన్న మా స్కూలు పిల్లలం అందరం కలిసి రాశాం. గుట్టపై హోటల్ కట్టడానికి పర్మిషన్ ఇవ్వ వద్దు అని. మా గ్రామస్థులం అందరం కలిసి ఈ ప్రాంతాన్ని ఎంతో కాపాడుకుంటున్నాం అని ప్రదాన మంత్రికి లెటర్ రాసాం. |
| రమణ | అరే చాలా మంచి పని చేసారు. ఇంకెందుకు ఆలస్యం. వెళ్ళి పోస్టాఫీసులో వేయండి. |

| | |
|---|---|
| సరిత | అవును అన్నయ్య మీ ప్రయత్నం ఎందాక వచ్చింది ? కోర్టు లో అప్లై చేశారు కదా. |
| రమణ | కోర్టు చాలా సానుకూలంగా స్పదించింది అక్కయ్య పనులు ఆపమని స్టే ఇచ్చింది. |
| వరుణ్ | అబ్బ కొంత టైం దొరికిందన్న మాట. |
| భాస్కర్ | అవును రేపు సర్పంచ్, గ్రామ పెద్దలందరూ కలిసి పర్యాటక శాఖా మంత్రిని కలవడానికి వెళ్తున్నాం. |
| | ---------------మ్యూజిక్------------- |
| వరుణ్ | అమ్మా అమ్మా త్వరగా రా TV లో మన పాండవుల గుట్టను చూపిస్తున్నారు. |
| జ్యోత్స్న | ఏది, అవును అమ్మా మన ఇష్యునే వస్తుంది. |
| సరిత | మొత్తానికి మన గ్రామస్తులు చాలా పట్టుదలగా ప్రయత్నం చేస్తున్నారన్న మాట, మీడియా దృష్టికి పోయింది కదా. |
| జ్యోత్స్న | అవును మీడియా కూడా మనవైపు గానే మాట్లాడుతుంది. |
| వరుణ్ | అదిగో మనం నాటిన మొక్కల గూర్చి చెబుతున్నారు. |
| జ్యోత్స్న | అమ్మా అదిగో మన ఊరి వాళ్ళు ర్యాలీగా వెళ్ళుతున్నారు ఎక్కడికమ్మా. |
| సరిత | బహుశా పర్యాటకశాఖా మంత్రి దగ్గరికి కావచ్చు. రిప్రజంటేషన్ ఇస్తారేమో. |
| వరుణ్ | అమ్మా కేంద్ర మంత్రి కూడా హైదరాబాద్ కు వచ్చారట అతనికి కూడా ఇస్తే బాగుండు. |
| సరిత | మామయ్య ఉన్నాడు కదమ్మా ఇప్పిస్తాడులే. |
| జ్యోత్స్న | అమ్మా హోటల్ కట్టడం ఆపేస్తారా? |
| సరిత | మన గ్రామస్తులు ఒత్తిడి బానే తెస్తున్నారమ్మా ఆపే అవకాశం ఉంది. |
| వరుణ్ | ఆపేస్తే బాగుండు. |
| సరిత | సరే పదండి భోజనం చేద్దాం. మామయ్యా, నాన్న ఈ రోజు రారట, అక్కడే ఉంటారట. |
| వరుణ్ | అక్కడే ఉండాలమ్మ, పని అయ్యేదాకా అక్కడే ఉండాలి. |
| | ---------------మ్యూజిక్------------------------------ |
| | ( టక్, టక్, టక్ తలుపు చప్పుడు, తలుపు తీపిన చప్పుడు ) |
| జ్యోత్స్న | అమ్మా నాన్న వచ్చారు. మామయ్యా రాలేదా నాన్న ? |
| భాస్కర్ | రాలేదమ్మా అక్కడే ఇంక కొంతమంది కేంద్ర మంత్రులను, రాష్ట్ర మంత్రులను కలుస్తానన్నాడు. |
| వరుణ్ | నాన్న ఏమిటి విశేషాలు ? ఏం జరిగింది ? హోటల్ కట్టడం ఆపేస్తారా? మన గుట్ట మనకే ఉంటుందా ? |

సరిత వరుణ్ ఏంటది ప్రశ్నల మీద ప్రశ్నలు, నాన్నను కొంచెం రిలాక్స్ కానియ్.

భాస్కర్ వాడి ఆత్రుత వాడిది. అన్ని విషయాలు సావధానంగా చెబుతాను, ఫ్రెష్ అయివచ్చి సరేనా

వరుణ్ సరేనాన్న.

భాస్కర్ ఊ ఇప్పుడు చెబుతాను. మేము కేంద్ర రాష్ట్ర పర్యాటక, పర్యావరణ శాఖ మంత్రులను కలిసాము. వారు చాలా సానుకూలంగా స్పందించారు. అంతేకాదు ప్రజలందరూ కలిసికట్టుగా ఒక ప్రాంతం గూర్చి ప్రకృతి దెబ్బ తీస్తుందని ఆందోళన చేయటం అభినందనీయం అన్నారు.

సరిత అవును TV లో చూసాను ధర్నాలో గ్రామస్తులు చాలా మంది పాల్గొన్నారుగా.

భాస్కర్ మన గ్రామస్తులే కాదు రాష్ట్రం నలుమూలల నుండి పర్యావరణ వేత్తలు వచ్చారు. దాంతో మీడియా కూడా చాలా ప్రాముఖ్యత నిచ్చింది.

వరుణ్ కట్టడం ఆగిపోయినట్టే కద నాన్న.

భాస్కర్ ఆగిపోయినట్టే నాన్న, అందరు హామీ ఇచ్చారు. అందుకే మామయ్య సిటీలో ఉన్నాడు. రేపు ఆథారైజ్ డుగా లెటర్ పట్టుకొస్తాడు. ఇది గ్రామస్థుల ఆస్థి వారి అనుమతి లేకుండా ఎవరు నిర్మాణాలు చేపట్టొదని.

జ్యోత్స్న వరుణ్ ఇక వెళ్ళి ప్రశాంతంగా పడుకో పీడకలలేమి రావులే.

అందరు నవ్వుతారు

-------------మ్యూజిక్ -------------------

( గ్రామస్థులు గోల గోలగా మాట్లాడుకుంటు ఉంటారు )

భాస్కర్ ముందుగా గ్రామస్తులందరికీ శుభవార్త. రమణ ఆథరైజ్ డుగా జీవో పట్టుకొచ్చాడు. అక్కడ నిర్మాణాలేమి చేపట్ట వద్దని ఇక నుంచి మన అనుమతి లేనిది ఎవరు మన పర్యాటక ప్రాంతం పై కన్నెయ్యరు.

( వరుణ్, జ్యోత్స్న అందరు హే, హే అంటూ చప్పట్లు కొడతారు )

సర్పంచ్

గ్రామస్థ లందరికి ఈ సందర్భంగా అభినందనలు, నేను మీ సర్పంచ్ గా ఉన్నందుకు ఏంతో గర్వపడుతున్నాను. మన మందరం ఐకమత్యంగా పోరాడాము కనుకనే సాధించుకోగలిగాము. ఇదే ఐకమత్యంతో మన గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా మలచుకుందాం. రమణ గార్కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుయజేస్తున్న మన ప్రాంతం కొరకు చాలా కృషి చేశాడు. ఇప్పుడు రమణ గారిని మాట్లాడవలసిందిగా కోరుతున్నాను.

రమణ

గ్రామస్థులకు అభినందనలు. మీ పోరాటం ఏంతో మందికి స్ఫూర్తిదాయకం. వారు, వారి ప్రాంతాలలోని పర్వత ప్రాంత ప్రకృతిని ఇలాగే కాపాడుకుంటారు.

ఈ సందర్భంగా మీకొక విషయం చెప్ప దలుచుకున్నాను గ్రామస్థు లకు కొంత మందికి హోటల్ వలన ఆదాయం వస్తుంది కదాని ఒక ఆలోచన ఉంది మనము మన గుట్ట ప్రాంతాన్ని ఆదాయ వనరుగా మలచుకోవచ్చు. గుట్ట పై అన్ని రకాల పండ్ల చెట్లతో, టేకు, కలప మొక్కలతో ఒక సామాజిక అడవిని పెంచుకుందాం. ఆ పండ్ల ద్వారా, కలప ద్వారా వచ్చిన ఆదాయాన్ని గ్రామస్థులు అనుభవించవచ్చు.

అందరు

అవును, అవును తప్పకుండా పెంచుదాం మన పర్యాటక ప్రాంతాన్ని సుస్థిరాభివృద్ధి చేసుకుందాం.

------------★★★★★★---------------